# తెలంగాణ ఆర్ట్ సొసైటీ ఆవిర్భావం అభినందనీయం

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి; తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ ఆర్ట్ సొసైటీ ఏర్పాటు చేయడం అభినందనీయమని సీనియర్ ఆర్టిస్ట్ డి.వి. రమణ(నెల్లూరు) స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా చిత్రకారులందరూ కలిసి తెలంగాణ ఆర్ట్ సొసైటీ ఏర్పాటు చేయడం పట్ల అభినందనలు తెలిపారు. చిత్రకారుడు అంటేనే చరిత్రకారుడు అని చెప్పవచ్చు. వారి కుంచె నుంచి అద్భుతాలు జాలువారుతాయి.. సజీవంగా మనం చూడలేకపోయిన విషయాలను మన కళ్ళముందుకు తీసుకుని వస్తారు వారు కడుపు ఆకలితో మలమాలలాడుతున్నా గుండెల్లో బాధ రగులుతున్నా.. తమ రక్తాన్నే రంగుగా మార్చుకుని అందమైన చిత్రాలను, అక్షరాలను సృష్టిస్తారు. అలాంటి మరువురాని కళాకారులకు ఏదైనా చేయాలనే తాపత్రయంతో తెలంగాణ ఆర్ సొసైటీ బుధవారం ఆవిర్భవించింది. తెలంగాణ చిత్రకారులందరినీ ఒక వేదికపైకి తీసుకుని వచ్చి వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుచుటకు కృషిత నిశ్చయంతో నూతన సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోని చిత్ర కళాకారులందరినీ ఒకతాటిపైకి తీసుకువచ్చేందుకే తెలంగాణ ఆర్ట్ సొసైటీ ప్రధాన ఉద్దేశం ఎంతో గొప్పది అన్నారు. పెయింటింగ్ ఆర్టిస్టులు అందరూ ఈ తెలంగాణ ఆర్ట్ సొసైటీలో చేరితే వారి భవిష్యత్తు బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ ఆర్టిస్ట్ లు నాగేందర్, వరంగల్ మధు, కాసుల పద్మావతి పడిగే సత్యం, నంద్యాల (పెయింటర్) శ్రీనివాస్, తానాజీ, యాకయ్య, మాతంగి మల్లేష్, ఇబ్రహీంలు ప్రసంగించారు. కార్యక్రమంలో ఆర్టిస్టులు కే. అశోక్, రామకృష్ణ, బాసిత్, శివాజీ, బండారి నరేష్ బండారి నరేష్, రాము లు పూర్తి మద్దతు తెలపడం అభినందనేయమన్నారు.





# కాళేశ్వరంపై ఎన్నో అనుమానాలు

- మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన మంత్రుల బృందం
- ఎందుకు చేపట్టారో అర్థం కావడం లేదన్న మంత్రి కోమటి రెడ్డి
- డిజైన్ లోపం వల్లే కాళేశ్వరం కుంగింది: మంత్రి పొంగులేటి
- వందలాది కోట్ల ప్రజాధనం వృధా చేసిన గత ప్రభుత్వం : మంత్రి ఉత్తమ్
- కమీషన్ల కోసమే కేసీఆర్ మానస పుత్రికగా కాళేశ్వరం: మంత్రి పొన్నం

తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీని శుక్రవారం ఐదుగురు మంత్రుల బృందం పరిశీలించింది. మధ్యాహ్నానికి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి బ్యారేజీ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా.. మంత్రులు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ ప్రాజెక్ట్‌ని ప్రారంభించినప్పటి నుంచే ఎన్నో అనుమానాలు ఉన్నాయని, తాము చెబుతూ వచ్చిన విషయాలే నిజమయ్యాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ గత ప్రభుత్వానికి మానసపుత్రిక అయ్యిందని వ్యాఖ్యానించారు.
తుమ్మడి హెట్టి దగ్గర ప్రాజెక్టు కడితే రూ.40 వేల కోట్లు ఆదా అయ్యేవని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. అసలు ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఇక్కడే ఎందుకు చేపట్టారో అర్థం కావడం లేదన్నారు. కేసీఆర్‌ను ఇంజనీర్ ఇన్‌చీఫ్ చేశారా? అని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టుని మొదలుపెట్టిన సమయంలోనే మీరు లీవ్ పెట్టి ఉండాల్సిందని ఇంజనీర్ ఇన్‌చీఫ్‌పై ఫైర్ అయ్యారు. అసెంబ్లీ మోటార్లు తెచ్చి కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని చెప్పారు. అప్పటి ప్రాజెక్టులను పూర్తి చేస్తే.. కాంగ్రెసుకు పేరు వస్తుందని కేసీఆర్ కుట్ర చేశారని ఆరోపణలు గుప్పించారు. కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు కూడా ఒక విఫల ప్రయోగమని దుయ్యబట్టారు. 152 మీటర్ల లెవల్‌లో తుమ్మడి హెట్టి దగ్గర ప్రాజెక్టు నిర్మించేందుకు అప్పటి కాంగ్రెస్ సీఎం రాజశేఖరరెడ్డి కృషి చేశారని పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. కానీ మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించలేదని, చర్చల దశలో ఉండగానే పరిస్థితులు మారిపోయాయని అన్నారు. ఆ తర్వాత 148 మీటర్ల ఎత్తులో మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారని, డిజైన్ లోపం వల్లే కాళేశ్వరం కుంగిందని పేర్కొన్నారు. ఆనాడు జాగ్రత్తలు తీసుకొని ఉంటే, ఇవాళ ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు.
కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజలు పలు విధాలుగా చర్చించుకుంటున్నారని, ఇది ఒకట్రెండు పిల్లర్లతో ఆగిపోదని తెలిపారు. ప్రాజెక్టు అంతా నాణ్యతా లోపమేనని వ్యాఖ్యానించారు. ఇది అప్పులు చేసి కట్టిన ప్రాజెక్టు అని, పంపులు మునగడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని మండిపడ్డారు. వందలాది కోట్ల ప్రజాధనం వృధా అయ్యిందని, దీనికి కారణం ఎవరని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలు ఉన్నాయని, బ్యారేజీల్లో స్టోరేజీ తక్కువగా ఉండాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ధవళేశ్వరం బ్యారేజీలో 3-4 టీఎంసీలకు ఎక్కువగా నిల్వ ఉండవన్నారు. కానీ కాళేశ్వరంలో 16 టీఎంసీల నీరు ఎలా నిల్వ చేయాలనుకున్నారో తెలియదని చెప్పారు. రాజకీయ కోణాలు, ఇతర కోణాల కారణంగా ప్రాజెక్టులో లోపాలున్నాయన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కోరుతామన్నారు. మేడిగడ్డ కుంగినప్పటి నుంచి ఇప్పటివరకూ కేసీఆర్ స్పందించలేదన్నారు. రూ.80 కోట్లున్న ప్రాజెక్టు వ్యయాన్ని లక్షన్నర కోట్లకు పెంచారన్నారు. మేడిగడ్డ కుంగడమే





కాదు, అన్నారం బ్యారేజీ కూడా డ్యామేజీ అయ్యిందని పేర్కొన్నారు. దీనిపై తాము న్యాయ విచారణ జరుపుతామని గతంలోనే చెప్పామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు గత ప్రభుత్వానికి మానసపుత్రిక అయ్యిందని పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. కనీసం చూసేందుకు కూడా వీలు లేకుండా చేశారని ఫైర్ అయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టులో బాంబులు పెట్టారని ప్రచారం చేశారన్నారు. లక్ష కోట్లు ఖర్చు చేసి ఫలితం లేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. భవిష్యత్తులో రైతాంగానికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే వివేక్ సైతం స్పందించారు. తుమ్మడి హెట్టి దగ్గర నిర్మించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని, కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలమయంగా తయారైందని విమర్శించారు. కాళేశ్వరం బ్యాక్ వాటర్ సమస్యకు పరిష్కారం చూపాలని, బ్యాక్ వాటర్‌లో పంటలు కోల్పోతున్న రైతులకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేదని చెప్పుకొచ్చారు.

## విద్యుత్ కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

- సింగరేణి అధికారులకు మల్లు భట్టి ఆదేశాలు
- వేసవిలోనూ విద్యుత్ కొరత తలెత్తకుండా చూడాలన్న మంత్రి
- బొగ్గు ఉత్పత్తిని పెంచి థర్మల్ పవర్ కేంద్రాలకు సరఫరా చేయాలని ఆదేశాలు
- ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్‌లో ఉత్పత్తికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచన
- నైనీ బ్లాక్ కోసం కేంద్రం, ఒడిశా ప్రభుత్వంతో చర్చించాలని ఆదేశం



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: రాష్ట్రంలో విద్యుత్ కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. శుక్రవారం సింగరేణి సంస్థ పనితీరుపై సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. సింగరేణి గనులు, విద్యుత్ ప్రాజెక్టులు, బొగ్గు ఉత్పత్తి, రవాణా, మార్కెటింగ్, సంస్థ ఆర్థిక స్థితిగతులు, వర్క్ ఫోర్స్ తదితర అంశాలపై అధికారులు.. మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మల్లు భట్టి మాట్లాడుతూ... వేసవి కాలంలో విద్యుత్ కొరత తలెత్తకుండా బొగ్గు ఉత్పత్తిని పెంచి థర్మల్ పవర్ కేంద్రాలకు నిరంతరం సరఫరా చేయాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్లో ఉత్పత్తికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.
నైనీ బొగ్గు బ్లాక్లో ఉత్పత్తిని ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం, ఒడిశా ప్రభుత్వంతో చర్చించాలని సూచించారు. తద్వారా విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. బొగ్గు గనులను వేలం వేయడాన్ని కార్మికులు వ్యతిరేకిస్తున్నారని కాబట్టి సంస్థకు మేలు జరిగేలా విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై చర్చ జరిగింది. అలాగే సింగరేణి విస్తరణలో భాగంగా బొగ్గు మైనింగ్తో పాటు ఇతర ఖనిజాల అన్వేషణ ప్రణాళికలపై మల్లు భట్టి అధికారుల నుంచి ఆరా తీశారు.



## తెలంగాణ నేర వార్షిక నివేదికను విడుదల చేసిన డీజీపీ రవి గుప్తా

- గత ఏడాదితో పోలిస్తే నేరాలు 8.97 శాతం పెరిగినట్లు వెల్లడి
- ఈ ఏడాది మొత్తం 2,13,121 కేసులు నమోదు చేశామన్న డీజీపీ
- సైబర్ నేరాలు 17.59 శాతం పెరిగినట్లు వివరణ

తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః తెలంగాణలో 2022తో పోలిస్తే ప్రస్తుత సంవత్సరం 8.97 శాతం నేరాలు పెరిగాయని డీజీపీ రవిగుప్తా వెల్లడించారు. ఆయన శుక్రవారం వార్షిక నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఏడాది 2,13,121 కేసులు నమోదైనట్లు వెల్లడించారు. సైబర్ నేరాలు గత ఏడాదితో పోలిస్తే 17.59 శాతం పెరిగాయన్నారు. 1,108 జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు. ఐపీసీ సెక్షన్ కింద 1,38,312 కేసులు నమోదయ్యాయని తెలిపారు. 73 అత్యాచార కేసులలో 84 మందికి జీవిత ఖైదు శిక్ష పడినట్లు తెలిపారు. 2023లో రాష్ట్రంలో 1,360 డ్రగ్స్ కేసులు నమోదయ్యాయని, గత ఏడాదితో పోలిస్తే ఇవి 15.6 శాతం అధికమన్నారు. 2,52,60 కిలోల గంజాయి, 1,240 గంజాయి మొక్కలను సీజ్ చేసి.. 2583 మందిని అరెస్ట్ చేశామన్నారు. 1,877 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయన్నారు. డ్రగ్స్ నియంత్రణకు యాంటి నార్కోటిక్ బ్యూరోను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 59 డ్రగ్స్ కేసుల్లో 182 మందిని అరెస్ట్ చేశామన్నారు. 175 మంది రిపీటెడ్ డ్రగ్ ఫెడ్లర్స్‌పై పీడీ యాక్ట్ నమోదు చేశామని, 12 మంది ఫారెన్ అఫెండర్స్‌ను అరెస్ట్ చేశామన్నారు.

## విచారణల పేరుతో బెదిరిస్తే భయపడే ప్రసక్తే లేదు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు




తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: విచారణ పేరుతో ప్రతిపక్షాలను బెదిరిస్తే భయపడే ప్రసక్తే లేదని టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. శుక్రవారం ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి ,కాలేరు వెంకటేష్ ,ముఠా గోపాల్ లు బీ ఆర్ ఎస్ ఎల్పీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ నేతృత్వం లో ఐదుగురు మంత్రుల బృందం కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్లారని తెలిపారు. అధికారుల పై మంత్రులు ప్రశ్నలు వర్షం కురిపించారు. కాంగ్రెస్ ఎన్నికల్లో 412 హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చిందని, వాటికి నిధులు సమీకరించలేక శ్వేత పత్రాలు న్యాయవిచారణల పేరిట డ్రామాలు ఆడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని, శ్వేత పత్రాలు న్యాయ విచారణలను స్వాగతిస్తున్నట్లు తెలిపారు, మేమే విచారణలు కోరామని, కాళేశ్వరం పై మంత్రుల పర్యటనతో మేము చెబుతున్న వాస్తవాలు తెలిశాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల రూపాయల అవినీతి జరిగిందన్నారు. కానీ 93 వేల కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు అయిందని పి పి టి లో లో వారే చెప్పారు. ఎన్నికల సందర్భంగా ఒక్క ఎకరం కూడా కాళేశ్వరం కింద పార లేదన్నారు. వారిచ్చిన నివేదిక లోనే 90 వేల ఎకరాల ఆయకట్టు వచ్చిందన్నారు.తుమ్మిడి హట్టి దగ్గర తిరిగి ప్రాజెక్టు చేపడతామని ఉత్తమ్ అంటున్నారు. నాడు వైఎస్ 2008 డిసెంబర్ 16 నాడు ప్రాణహిత కు శంఖుస్థాపన చేశారు. మహారాష్ట్ర అక్కడ ప్రాజెక్టు కు ఒప్పుకోలేదని, అక్కడ నీటి లభ్యత లేదని కేంద్ర జల వనరుల సంఘం లేఖ కూడా రాసిందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో 152 మీటర్ల దగ్గర ప్రాజెక్టు కు ఒప్పుకునేది లేదని నాటి మహారాష్ట్ర సీఎం పృథ్వీ రాజ్ చవాన్ స్పష్టం చేసి లేఖ రూపం లో తన నిరసన తెలియజేశారు.మహారాష్ట్ర నిరసనలు తెలిపినా నాడు వైఎస్ శంఖుస్థాపన చేసి తట్టెడు మన్ను తీయలేదు. ఈపీసీ పద్దతిలో 6 వేల కోట్ల రూపాయల దాకా నాటి వై ఎస్ ప్రభుత్వం మొబిలైజేషన్ అడ్వాన్సులు కాంట్రాక్టర్లకు చెల్లించింది. అన్నీ అంశాలు పరిగణన లోకి తీసుకుని మహారాష్ట్ర ప్రభుత్వం తో కేసీఆర్ ఒప్పందం కుదుర్చుకుని ప్రాణహిత ప్రాజెక్టును రీ డిజైన్ చేశారు. దాదావు 11 రకాల అనుమతులు తీసుకున్నాకే కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు పనులు మొదలు పెట్టారు.

## నంది అవార్డులపై మంత్రి కోమటిరెడ్డి కీలక వ్యాఖ్యలు

- కొత్త ఏడాదిలో నంది అవార్డులు ఇస్తాం
- చిత్ర పరిశ్రమను సత్కరిస్తే తమ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని వ్యాఖ్య
- ఉగాది నాటికి నంది అవార్డులు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామన్న కోమటిరెడ్డి



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి:నంది అవార్డులపై రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొత్త ఏడాదిలో నంది అవార్డులను ఇస్తామని స్పష్టం చేశారు. చిత్రపరిశ్రమను సత్కరిస్తే తమ ప్రభుత్వానికి కూడా మంచి పేరు వస్తుందని వ్యాఖ్యానించారు.
రానున్న ఉగాది నాటికి నంది అవార్డులను ఇచ్చే అవకాశాలను పరిశీలిస్తామని స్పష్టం చేశారు. పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా ఈ అవార్డులను ఇస్తామన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించిన అనంతరం సినిమా పెద్దలను ఆహ్వానిస్తామని తెలిపారు.

## లక్ష కోట్లలో రూ. 50 వేల కోట్ల అవినీతి జరిగింది

: కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ.1 లక్ష కోట్లు ఖర్చు పెట్టామని చెబుతున్నారని, కానీ అందులో రూ.50వేల కోట్ల వరకు అవినీతి జరిగిందని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వం కుట్రపూరితంగా ఖజానాను ఖాళీ చేసిందని విమర్శించారు. ఆలోచన లేకుండా రాష్ట్ర ప్రజలపై భారం మోపారని విమర్శించారు.
ప్రాణహిత పనులు గతంలో కాంగ్రెస్ హయాంలోనే మూడొంతులు పూర్తయ్యాయని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీకి పేరు వస్తుందని దానిని పూర్తి చేయలేదని మండిపడ్డారు. ఇంతటి సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ఈ కాలంలో ఆనకట్ట కుంగిపోవడం ద్వారా ప్రపంచంలో తలదించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయమై అధికారులు... ఇంజినీర్ల సమాధానాలపై ఆధారపడకుండా వేరే సంస్థతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. జ్యూడిషియల్ విచారణ కోసం వేచి చూడవద్దని సూచించారు. అసలు రెండో టీఎంసీ పనులు పూర్తి కాకముందే మూడో టీఎంసీకి ఏమి అవసరం వచ్చింది? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులను నిర్లక్ష్యంగా కట్టారని ఆరోపించారు.

## లోక్‌సభ ఎన్నికలకు కారు పార్టీ రెడీ

- జనవరి 3నుంచి నియోజకర్గాల వారీగా సన్నాహక సమావేశాలు
- తెలంగాణ భవన్ వేదికగా సమీక్షలు
- గెలుపే లక్ష్యంగా కేసీఆర్ వ్యూహం

తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః లోక్‌సభ ఎన్నికలకు భారత రాష్ట్ర సమితి పూర్తి స్థాయిలో సమాయత్తమవుతోంది. జనవరి 3వ తేదీ నుంచి భారాస.. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. తెలంగాణ భవన్ వేదికగా ముఖ్యనేతలతో వరుస భేటీలు కొనసాగుతాయని పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు తెలంగాణ భవన్ వేదికగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ సెక్రటరీ జనరల్ కె.కేశవరావు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రులు హరీశ్రావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్రెడ్డి, జగదీశ్రెడ్డి, ప్రశాంత్రెడ్డి, నిరంజన్రెడ్డి ఈ సమావేశాలు నిర్వహించనున్నారు. జనవరి 3న ఆదిలాబాద్ లోక్సభ నియోజకవర్గ సమావేశంతో సన్నాహక సమావేశాలు ప్రారంభంకానున్నాయి. 4న కరీంనగర్, 5న చేవెళ్ల, 6న పెద్దపల్లి, 7న నిజామాబాద్, 8న జహీరాబాద్, 9న ఖమ్మం, 10న వరంగల్, 11న మహబూబాబాద్, 12న భువనగిరి, 16న నల్గొండ, 17న నాగర్కర్నూల్, 18న మహబూబ్నగర్, 19న మెదక్, 20న మల్కాజ్గిరి, 21న సికింద్రాబాద్, హైదరాబాద్ లోక్సభ నియోజకవర్గాల వారీగా సమావేశాలు జరుగుతాయని భారాస నేతలు తెలిపారు. లోక్సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నారు. భారాస అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా జరగబోతున్న ఈ సమీక్షల అనంతరం ప్రజాక్షేత్రంలో ప్రచారపర్వాన్ని బలంగా నిర్వహించేందుకు ఆ పార్టీ యంత్రాంగం కసరత్తు చేస్తోంది.



## ఆర్టీసీ ప్రయాణికులకు శుభవార్త

### నేడు రోడ్డెక్కనున్న 80 కొత్త బస్సులు

తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః ప్రజలకు మెరుగైన నాణ్యమైన సేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కృషి చేస్తున్నది. ఎప్పటికప్పుడు రవాణారంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటూ.. వినూత్న పద్ధతుల్లో ప్రయాణికులకు చేరువ వుతున్నది. ఈ క్రమంలోనే ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులను కొనుగోలు చేస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.400 కోట్ల వ్యయంతో 1,050 కొత్త డీజిల్ బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందులో 400 ఎక్స్ప్రెస్, 512 పల్లె వెలుగు, 92 లహరి స్లీపర్ కమ్ సీటర్, మరో 56 ఏసీ రాజధాని బస్సులను కొనుగోలు చేయనున్నది.




వీటికి తోడు పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాలను హైదరాబాద్ సిటీలో 540, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 500 బస్సులను అందుబాటులోకి తెచ్చేందుకు ఆర్టీసీ యాజమాన్యం చర్యలు చేపడుతున్నది. కొత్త బస్సులన్నీ విడుతలవారీగా వచ్చే ఏడాది మార్చి నాటికి ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని ప్రణాళికలు రూపొందించింది. ప్రస్తుతం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణం నేపథ్యంలో బస్సుల్లో రద్దీ పెరిగింది. ఈ క్రమంలో అత్యాధునిక హంగులతో 80 కొత్త బస్సులు శనివారం రోడ్డెక్కించేందుకు చర్యలు చేపట్టింది.
ఇందులో 30 ఎక్స్ప్రెస్, 30 రాజధాని ఏసీ, 20 లహరి స్లీపర్ కమ్ సీటర్ (నాన్ ఏసీ) బస్సులున్నాయి. ఆయా బస్సులను హైదరాబాద్ నగరంలోని ఎన్టీఆర్ మార్గ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ ప్రారంభించనున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
మోడ్రన్ ప్రభుత్వ మెటర్నిటీ హాస్పిటల్, పేట్లాబుర్జ్, హైదరాబాద్
టెండరు ప్రకటన
Rc నెం. A7/MGMH/2023/1614 తేది: 27-12-2023
బయో-మెడికల్ వ్యర్థాలను సేకరించడం, రవాణా చేయడం, చికిత్స చేయడం మరియు సురక్షితంగా పారవేయడం కోసం రిజిస్టర్డ్ ఏజెన్సీల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడ్డాయి. వారు 462 పడకల ఆధునిక మెటర్నిటీ హాస్పిటల్, పేట్లాబుర్జ్, హైదరాబాద్ ప్రభుత్వం నుండి బయో-మెడికల్ వ్యర్థాలను (సేకరణ, రవాణా, చికిత్స మరియు సురక్షిత పారవేయడం) ఎత్తివేసేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నుండి రోజుకు బెడ్ రూ.4-00 చెల్లుబాటు అయ్యే అధికారాన్ని కలిగి ఉండాలి. 02. సీల్డ్ టెండర్ ఈ కార్యాలయంలో 17-01-2024 మ॥ 1.00 గం॥లలోపు లేదా అంతకు ముందు స్వీకరించబడాలి, పోస్టల్ జాప్యానికి మేము బాధ్యత వహించము. 03. సీల్డ్ టెండర్లు 18-01-2024 మ॥ 2.00 గం॥లకు సూపరింటెండెంట్ ఛాంబర్స్‌లో తెరవబడతాయి
సం/- సూపరింటెండెంట్, మోడ్రన్ గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్, పేట్లాబుర్జ్, హైదరాబాద్
DIPR.RO.No.2363-DP/CL/Advt/1/2023-24, Dt : 29-12-2023

కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్
రిజిస్టర్డ్ కార్యాలయం: కోరమాండల్ హౌస్, 1-2-10, సర్దార్ పటేల్ రోడ్, సికింద్రాబాద్ -500003, తెలంగాణ. CIN: L24120TG1961PLC000892

వ్యవసాయ, సహకార మరియు రైతుల సంక్షేమ శాఖ, వ్యవసాయం మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం వారు జారీ చేసిన 24 అక్టోబర్ 2015 నాటి ఆర్డర్ నెం. S.O.2900(E)కి అనుగుణంగా, దాని సవరణలు S.O. 4120 (E) 30 డిసెంబర్, 2017 మరియు S.O. 2001 (E), 22 జూన్ 2020 ఆధారంగా కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, బీచ్ రోడ్, వాకలపూడి(V), కాకినాడ-533005, AP) 100 % నీటిలో కరిగే ఎరువుల మిశ్రమాన్ని క్రింద ఇవ్వబడిన వివరణల ల ప్రకారం ఉత్పత్తి చేసి విక్రయించాలని నిర్ణయించినట్లు తెలియచేయడమైనది.

N:P:K:S:Zn:B 24:24:0:2.8:1.2:0.15 మొత్తం నత్రజని 24%, $P_2O_5$ రూపంలో మొత్తం భాస్వరం: 24%, K2O రూపంలో మొత్తం పొటాషియం: 0%,S రూపంలో మొత్తం సల్ఫర్ : 2.75%,Zn రూపంలో మొత్తం జింక్: 1.2%, B రూపంలో మొత్తం బోరాన్: 0.15%,

N:P:K:S 20:15:15:6 నత్రజని: 20%, P2O5 రూపంలో మొత్తం భాస్వరం: 15%, $K_2O$ రూపంలో మొత్తం పొటాషియం: 15%, S రూపంలో మొత్తం సల్ఫర్: 6%

N:P:K:S:Zn 10:12:32:6:1 నత్రజని: 10%, P2O5 రూపంలో మొత్తం భాస్వరం: 12%, $K_2O$ రూపంలో మొత్తం పొటాషియం: 32%, S రూపంలో మొత్తం సల్ఫర్: 6%, Zn రూపంలో మొత్తం జింక్: 1 %

పైన తెలుపబడిన శ్రేణులన్నిటిలో (a) బరువు ద్వారా తేమ శాతం గరిష్ఠంగా 0.5 % (b) బరువు ద్వారా మొత్తం క్లోరైడ్ శాతం గరిష్ఠంగా 1.5 % (c) బరువు ద్వారా నీటిలో కరగని పదార్థం శాతం గరిష్ఠంగా 0.5% (d ) బరువు ద్వారా NaCl రూపంలో సోడియం శాతం గరిష్ఠంగా 0.5 % (e)బరువు ద్వారా లెడ్ (Pb) శాతం గరిష్ఠంగా 0.003% (f) బరువు ద్వారా కాడ్మియం (Cd) శాతం గరిష్ఠంగా 0.0025 %, (g) బరువు ద్వారా ఆర్సెనిక్ శాతం గరిష్ఠంగా: 1 %.

Email ID:mail@coromandel.murugappa.com, Web: www.coromandel.biz/
Tel: 91-40-27842034/27847212, Fax : 91-40-27844117